# కలలో వేధించిన పిలక

మా ఇంటివద్ద ఒక గుడిఉంది. ఆగుళ్లో ప్రతిరోజు సాయంకాలం మావీధిపిల్లలూ, నేను కలసి ఆడుకుంటుంటాం. మా మామూలు ప్రకారంగా మేము ఒక సాయంకాలం ఆడుకుంటుంటే ఆపేటలో వున్న ఒక తాతగారు ఆగుళ్లోకి మాఆటలు చూడాలని ఒక కర్ర పుచ్చుకుని వంగి నడుస్తూవచ్చాడు. ఆతాత బలేకోపిష్టి. ఆయన పిలక ఎవరైనా ముట్టుకుంటే కస్సుమనేవాడు. ఆయన మా ఆటలవంక చూస్తూ కూర్చుంటే నాకో దుర్బుద్ధి పుట్టింది. అదేమిటంటే - ఆతాత పిలక పుచ్చుకుంటే ఆయన ఎలాగూ ఉడుక్కుంటాడు; ఆయన ఉడుకుమోతు తనం చూసి మిగతావాళ్లందరూ ఆనందిస్తారని నాబుద్ధికి తోచింది. నాబుద్ధికి తోచటమేమిటీ, పని జరిగి పోవటమేమిటి,—రెండూ ఒక్కసారే జరిగిపోయినై!

నేను పిలక పట్టుకోవటం చూసి అక్కడి పిల్లలందరూ 'గొల్లు' మని నవ్వి చప్పట్లు చరిచారు. అంత మంది పిల్లలలో తనని అవమానం చేయటం చూసి, ఆతాత మండిపడి "చూడు మీనాన్నతో చెప్పి ఏం చేయిస్తానో" అని గబగబా గుడి ఇవతలకొచ్చి, "చూడరా శేషయ్యా మీవాడు ఏం చేశాడో!" అని ఒక పొలికేక పెట్టాడు. జరిగిన సంగతంతా మానాన్నగారు ఆతాత ద్వారా విని ఒక పెద్దకావడి బద్ద తీసుకొచ్చారు - నన్ను చావబాదడానికి. మా నాన్నగారంటే నాకు బలే చెడ్డభయం.

గుడి దగ్గరకు వచ్చేస్తున్న మా నాన్నగారిని. కొందరు పిల్లలుచూసి లోపలికి పరుగెత్తుకొచ్చి "ఒరేయ్! ఒరేయ్! మీనాన్న నిన్ను చావబాదడానికి పెద్ద కావడిబద్ద తీసుకొస్తున్నాడు రోయ్"అని చెప్పారు.

నామీద కోపంగా వున్న



కొందరు 'అబ్బాయిగారి తిక్క వదుల్తుంద'ని అన్నారు. మరి కొందరు 'తన్నులు గుద్దులు తలకాయ మాంసం' అని పాటపాడ సాగారు. కొందరు భయంతో పారి పోయారు.

నేను మాత్రం గడగడ వణికి పోయాను. మానాన్నగారు గుళ్లోకి అడుగు పెట్టగానే కొయ్యబారి పోయి ఆగుళ్లోవున్న స్తంభాల్లో నేనూ ఒక స్తంభంగా మారిపోయాను. మానాన్నగారు కోపంతో చిందులు తొక్కుతూ 'ఏడీ వెధవ' అని కేకలు వేస్తూ గుడిచుట్టూ తిరిగారు. నేను ఆయనకు కనిపిస్తేగా కొట్టటానికి! నేను స్తంభంగా మారి పోయానుగా.

నేను కనిపించకపోగా మా నాన్న ఇంటికి వెళ్లిపోయారు. ఇంటికి వెళ్తే తంతారని నేను మాత్రం గుడి సింహద్వారంవద్ద కూర్చుని ఏడ్పు మొదలెట్టాను. కొంతసేపు ఏడ్చి ముఖం ఇటు తిప్పే సరికి అల్లంత దూరంలో, మా తమ్ముడు కనపడ్డాడు. నన్ను పిలుచుకు పోవటానికి మానాన్నగారే వాడిని పంపించారని నాకు తెలుసు. నే నెప్పుడైనా అల్లరిచేస్తే మా నాన్నగారు మా తమ్ముడిని పంపి నన్ను పట్టించి తంతూఉంటారు. మా తమ్ముడికి నామీద బలేకచ్చ. మా నాన్నగారు నన్ను 'చితకా మతకా' తంతూవుంటే వాడు లోపలనుంచి తొంగిచూస్తూ నన్ను వెక్కిరిస్తూ చంకలు కొట్టుకుంటాడు. అందుకే నాకు వాడిమీద గొంతుక వరకూ వుంటుంది కోపం!

మా తమ్ముడు పట్టుకుంటానికి వస్తుంటే నేను పలాయనమంత్రం చిత్తగించాను. వాడు నన్ను వెంబడించాడు. నేను పిక్కబలం కొద్దీ పరుగెత్తుతున్నాను. కాని అదేమి చిత్రమో, నేనెంత జోరుగా పరుగెత్తినా కొద్దిదూరమే దాటగలుగుతున్నా. వాడు మాత్రం పెద్ద పెద్ద అంగలు వేసుకుంటూ నాదగ్గరికే వచ్చేశాడు. ఇక మా తమ్ముడు నన్ను ఒక నిముషానికో అర నిముషానికో పట్టుకుంటాడనగా నేను విచిత్రంగా సుడిగాలిలో కాగితం ముక్కలా పైకి ఎగిరిపోసాగాను. మాతమ్ముడు నావంక విచిత్రంగా చూసి, భయం వేసిందో ఏమో,

**శ్రీ మద్దుల నారాయణమూర్తి**

వెనక్కి తిరిగి ఇంటివైపు పరుగెత్తాడు.

నేనలా గాలిలో కొంచెం సేపు ఎగిరి ఎగిరి మళ్లా క్రిందికి దిగి వచ్చాను. నేను క్రిందకు దిగి వచ్చి చూచేటప్పటికి మానాన్న ఎదురుగా వున్నారు. ఇంకేముందీ- ఆయన పళ్లు బిగించి ఉరుముతూ "ఏరా గాడిదా! ఇప్పు డెక్కడికి పారిపోతావ్?" అంటూ మెట్లు దిగి వస్తున్నారు. గజగజా వణికి పోయాను. ముచ్చెమటలు పోసేశాయి. అదేమి విచిత్రమో గానీ నుంచొన్న మనిషినల్లా నీళ్లు కారి పోయాను. క్రింద కారిపోయిన నీళ్లన్నీ కలిసి మంచు గడ్డగా మారి పోయాను. మా నాన్నగారు ఆ మంచుగడ్డను ఎత్తి పట్టుకొని, నేను మంచుగడ్డగా మారిపోయినందుకు 'బావురు' మని ఏడవసాగారు. మా నాన్నగారు నన్ను అంటే [మంచుగడ్డ రూపంలోవున్న నన్ను) క్రింద పడవేసి దిగాలమని చతికిలపడి ఏడ్వసాగారు. నేను క్రింద పడటంలో మురికిగుంటలోపడి ఆప్రవాహానికి నీటిలో కొట్టుకుపోతున్నాను. కొంచెం సేపటికి సముద్రంలో తేలుతున్నాను.

ఇంతలో ఒక గ్రద్ద అకస్మాత్తుగా వచ్చి (మంచుగడ్డ రూపంలో వున్న నన్ను) పైకి తన్నుకెళ్లింది. నేను కళ్లు తెరచి చూచేటప్పటికి నన్ను తన్నుకెళ్లుతున్నది నిజంగా ప్రాణంతోవున్న గ్రద్దకాదనీ, నేనే ఒక చెక్కగ్రద్ద కాళ్లు పట్టుకొని ఆకాశంలో ఎగురుతున్నానని తెలుసుకున్నాను. నాకు ముందుగా ఒక తాటినిచ్చెన గ్రద్ద కడుపులోంచి క్రిందకు వేళ్లాడుతోంది. దాన్ని పట్టుకో ప్రయత్నించాను. కాని అది నాకందలేదు. ఇంతలో ఒక పెనుగాలి వీచింది. ఆగాలికి ఆతాటినిచ్చెన నాదగ్గిరిగా వచ్చింది. వెంటనే ఆనిచ్చెనను పట్టుకొని పైకి యెక్కి గ్రద్ద ఆకారంలో ఉన్న ఆ చెక్కవిమానంలోపల కూర్చున్నాను. ఆచెక్క విమానం 'భయ్, భయ్'మంటూ వెళ్లి వెళ్లి పెద్ద పెద్ద కొండల మధ్యగా క్రిందికి దిగనారంభించింది. కొంచెం సేపు అలాదిగి ఒక పర్వత పైభాగంలో ఒక గుహ ఉంటే, సరాసరి పోయి ఆగుహలోనికి దూరింది. ఆగుహ అంతా చీకటిమయం. విమానం లోంచి దిగి క్రిందకి వచ్చాను.

ఇంతలో ఎక్కడనుంచో నాల్గు

# ★ కలలో వేధించిన పిలక ★

వైపులనుంచీ మంటలు పొగలు గ్రక్కుకుంటూ వస్తున్నాయ్. ఇంకా ఏవేవో శబ్దాలు 'కీచుకీచు' మంటూ 'బామ్‌బామ్' మంటూ వినబడసాగినై. నాకు బలే భయమేసింది. చెక్కవిమానంలోకి ఎక్కి పారిపోదామని ప్రక్కకు చూచాను. ఆ చెక్కవిమానం ఏదో పెద్ద శబ్దం చేసుకుంటూ ఒకపిచ్చుకగా మారి బయటికిఎగిరి పోయింది! అమ్మో! పిచ్చుక ఎంత మోసం చేసిందీ! క్రమేపి నాముందు వున్న మంటలు మీది మీదికి వస్తున్నాయ్. నేను వెనక్కు వెళ్లిన కొద్దీ అవి ముందుకు తరుముకు రాసాగినయ్. అలానే వెనక్కు చాలాదూరం నడిచివచ్చాను, చివరకు గుహ చివరిభాగందాకా వచ్చాను. ఇక ఎటువైపూ దారి లేదు. ముందు మంటలు : వెనుక పర్వతపువాలు. ఇక అక్కడనుంచి క్రిందికి దూకి పారిపోదామని గుహాద్వారంనుంచి క్రిందకు చూచాను. అమ్మయ్యో! ఇంకేముంది? నేను భూమికి పైగా కొన్ని వేల మైళ్ల ఎత్తున ఉన్నాను. అంత ఎత్తునుంచి క్రిందికి చూడడంలో నా కళ్లు తిరిగి మూర్ఛపోయి క్రిందకు పడ్డాను.

తిరిగి నేను కళ్లు తెరచి చూచేసరికి కొండ నడిభాగాన మెత్తటి మట్టిమీద పడివున్నాను. ఎందువల్లనో నాకు దెబ్బలు ఏమీ తగల్లేదు! నాముందు మళ్లీ ఒక గుహాద్వారం కనిపించింది. ఈసారి వెనుకటి గుహలోవలె ఈ గుహలో మంటలు కనిపించలేదు. సూర్యప్రకాశానికి మించే కాంతులు కనిపించినై. నేను లేచి ఒళ్లు దులుపుకొని లోపలకు నడిచాను అక్కడ అక్కడ కొన్ని కొలనులు కన్పించాయ్. ఆకొలనులలోని నీళ్లన్నీ బంగారపు రంగుతో మెరసిపోతున్నాయి. ఒడ్డున కొన్ని చెట్లు కన్పించాయి. అవి అన్నీ వెండితో చేసి ఉన్నాయ్. నేనా విచిత్రాలు చూసుకుంటూ ఆశ్చర్యంతో ముందుకు నడిచాను.

ఒకచోట రత్నాలు మాణిక్యాలు, ఇంకా ఏవేవో విలవగల రాళ్లు పెద్ద పెద్ద రాసులుపోసి వున్నాయి. ఆరాసులు ధగధగ మెరిసిపోతూ వున్నాయ్. నాకు కొన్ని రత్నాలు జేబులో పోసుకోవాలని బుద్ధి పుట్టింద. అందుచేత ఒక రాసివద్దకు వెళ్లి దోసిలి నిండా రత్నాలు తీశాను. వెంటనే ఆరాసి లోంచి ఒక పెద్ద నల్లతాచు-యించుమించు మారోకలిబండంత లావూ, నాలుగయిదు గజాల పొడవూ వుంటుంది-బుస్‌మంటూ లేచినా వెనుక పడింది. నేను ఆరత్నాలన్నీ అక్కడే పారేసి పరుగెత్తాను. ఆపాము నా వెనుకపడి తరుమసాగింది. నేనలా పరుగెత్తి పరుగెత్తి చూడకుండా ఆకొండనుంచి క్రింద వున్న ఒక బిలంలో పడిపోయాను.

ఆబిలద్వారం చాలా పొడుగ్గా వుంది. ఆబిలద్వారం అడుగు భాగాన ఒక నది ప్రవహిస్తూ వున్నది. ఆనదిలో ఇద్దరు మనుష్యులు బోటుషికారు చేస్తున్నారు. నేను వచ్చి, వచ్చి ఆబోటులో పడ్డాను. నేను చాలా ఎత్తునుంచి పడ్డందువల్ల ఆబోటు అటూ ఇటూ ఊగిపోయి మునిగిపోయేటంత ప్రమాదం ఏర్పడింది. కాని దైవవశాత్తు మునిగిపోలేదు. ఆరంధ్రంలోంచి పైకి చూచాను, ఇంకా ఆపాము తరుముకు వస్తోందేమోనని. అది ఆబిల పైభాగంలోనే 'బుస్' కొట్టుకుంటూ చూస్తూంది అప్పుడు దాని స్వరూపం చూసి నేను 'గజగజ' వణకిపోసాగాను. ఇంతలో పడవ ముందుకు సాగిపోయింది.

ఆపడవలో 'వున్నవాళ్లు ఆబిలంలోంచి ఎలా పడ్డావ్? అసలు నీ చరిత్ర ఏమిటి? సంగతి సందర్భమంతా" చెప్పమన్నారు. పూసగుచ్చినట్లు సంగతి అంతా చెప్పాను. తామూ ఆరత్నాల కోసమే వెతుకుతున్నామనీ, అక్కడికెళ్లే మార్గమేదో చెప్పమని నన్ను అడిగారు. నాకేం తెలియదని చెప్పాను. కాని వాళ్లునమ్మలేదు. దారేదో చెప్పకపోతే గొంతు పిసికి చంపుతామన్నారు. నేను బిక్కమొహం వేసి నాకేం తెలియదని 'బావురు' మన్నాను. "ఊహు ఈ ఏడ్పులు బొబ్బలు మాదగ్గర పనికిరావు. చెప్తావా? చెప్పవా?" అని ఇద్దరూ కలసి నాకంఠం గట్టిగా నొక్కసాగారు. నేను అంతకంతకూ బిగుసుకుపోయి ఒక కర్రగా మారిపోయాను. వాళ్లు అది చూచి "అమ్మ బాబోయ్ ఇదేదో దెయ్యంరోయ్"అని నన్ను [కర్రరూపంలో వున్న నన్ను) నీళ్లలోకి దూరంగా

విసరిపారేసి, ఒడ్డు వైపుకి తమ పడవను చకచకా నడుపుకు పోయారు.

నేను నీళ్లలో అలా కొట్టుకు పోతుంటే ఒకచోట ఒక పెద్దచేప నన్ను పట్టుకొని నీళ్ల అడుగుభాగానికి తీసుకెళ్ల సాగింది. అలా మేము వెళ్లగా వెళ్లగా ఒకచోట ఒక పెద్ద గుహకనపడింది. ఆ గుహద్వారానికి తలుపులున్నాయి. ఆ రెండు తలుపులూ రెండుచేపల తోలుతో చేయబడి వున్నాయ్. వాటి పొలుసు పొలుసుకి రత్నాలు పొదగబడి దేదీప్యమానంగా వెలిగి పోతున్నాయి.

నేనా ద్వారం దగ్గరకు వెళ్లగానే మనిషిగా మారి పోయాను. అక్కడేవున్న ఇద్దరు చేప భటులు తలుపులు తెరిచారు. నాప్రక్కగానున్న చేప నాచేయి పట్టుకొని లోపలికి తీసుకుపోయింది. అలా మేము కొన్ని ద్వారాలు దాటాము. చివరకు ఒక పెద్ద హాలులోకి వచ్చాం. అక్కడ ఒక పెద్ద దర్బారు నడుస్తోంది. ఆదర్బారులోని వాళ్లంతా చేపలే. మారాక చూచి వాళ్లంతా లేచి నుంచున్నారు. అప్పటికి నాకు అది చేపలరాజ్యం అనీ, నా ప్రక్కన వున్న చేప చేపలరాణి అనీ బోధపడింది.

చేపల రాణి వెళ్లి సింహాసనం మీద కూర్చుంది. నన్ను ఆ ప్రక్కన వున్న సింహాసనంమీద కూర్చోపెట్టుకొంది. అవతల ప్రక్కన చేపలరాణీ కూతురు గాబోలు వుంది. నేనా దర్బారువంక విచిత్రంగా చూస్తున్నాను. నాకు అంతా అయోమయంగా వుంది. కొంచెం భయం కూడా వేసినమాట నిజమే!

ఇంతలో చేపలరాణీ లేచి తనకు చాలా కాలంగా తన కూతురుని మానవుడి కెవడికైనా యిచ్చి పెళ్లి చేయాలని వుందనీ, రేపే తనకుమార్తెకూ నాకూ వివాహం చేయ నిశ్చయించాననీ ఒక దీర్ఘోపన్యాసం ఇచ్చింది. నాగుండె 'గుభేల్' మంది. నేను చచ్చినా ఆచేపలరాణి కూతురుని పెళ్లి చేసుకోనన్నాను. అందుకు ఆరాణీ మండిపడి అలా చేసుకోకపోతే శిరచ్ఛేదం చేయిస్తానన్నది. "అందుకైనా సిద్ధమేగాని చేపలకంపు కొట్టే నీకూతురినిమాత్రం వివాహం చేసుకోబో" నన్నాను. ఆ రాణి వెంటనే ఏదో సైగచేసింది. రెండు చేప తలారులు రెండు పెద్ద విచ్చుకత్తులతో తయారయినారు. ఆ రాణి ఇప్పుడైనా ఆలోచించుకోమని కావాలిస్తే కొంత 'టైమ్' కూడా యిస్తాననీ చెప్పింది. నాకుకోపంవచ్చి ఏమీ అక్కర్లేదన్నాను. అయితే తీసుకెళ్లి శిరచ్ఛేదన చేయండని ఆజ్ఞాపించింది. వాళ్లు నన్ను నేల మీదపడేసియీడ్చుకుపోతున్నారు. 'అరెరె! కొంతటైము అడిగి ఎలాగన్నా పారిపోతే బాగుండే' దని అప్పుడు అనిపించింది. ఇంతలో వాళ్లు నన్ను. వధ్యశిలవద్దకు తీసుకువచ్చారు. నారెండు చేతులు లాగి పట్టుకొని సిద్ధంగా వుండమని కత్తులు ఎత్తేసరికి నేను వాళ్ల చేతుల్లో ఒక పొడుగాటి తాడుగా మారిపోయాను!

వాళ్లు శ్చర్యంలో నన్ను తీసుకెళ్లి 'మహారాణీ! ఆకుర్రాడు విచిత్రంగా తాడుగా మారి పోయాడు' అని చెప్పారు. ఆ మహారాణి ఆతాడుని తీసుకొని పరికించి "వాడ్ని ఎక్కడ దాచారో తీసుకు రండని" ఆజ్ఞాపించి ఆతాటిని క్రిందకు విసిరేసింది. వెంటనే నేను కొబ్బరికాయగా మారి దొర్లుకుంటూ దొర్లుకొంటూ అన్ని ద్వారాలూ దాటుకుంటూ నడి సముద్రంలో తేలిపోయాను. ఇంతలో అక్కడికి ఒక చేపల పడవ వచ్చింది. ఆబోటులోంచి కొందరు జాలర్లు చేపలకోసం వల వేశారు. నేను ఒక వలలో చిక్కుకున్నాను. ఆజాలర్లు చేపలన్నీ బుట్టలో వేసుకొని నన్ను [కొబ్బరికాయను] కొట్టుకు తిందామని కొట్టటానికి పైకెత్తారు. "నన్ను కొట్టకండి. నేను మనిషినండోయ్" అని పెద్దగా కేక వేశాను.

"ఏడ్చావులే ఏమిటా పొలికేకలు? లేలే బడివేళయింది, సినిమాలుచూడటం:కలవరించటం" అని వీపుమీద మా అమ్మ ఒకటి చరిచింది.

అప్పుడు నేను స్వప్న లోకంలోంచి ఇవతల పడి, నా అవయవాలన్నీ సరిగా వున్నాయో లేదోనని సరిచూసుకొన్నాను.

★

హకల్ బెరిఫిన్

**వెల రూ. 2-0-0**

తపాలాఖర్చు ప్రత్యేకము

ఆంధ్రగ్రంథమాల, మద్రాసు-7.